అంతా మనస్సులో ఉంది, క్షోభ అంతా మనస్సులోనే ఉంది. దానిని పరిశీలించటం మానివేసి ఎంతసేపు ఆ చెట్టు చుట్టూ తిరుగుదాము, ఈ పుట్టచుట్టూ తిరుగుదాము, రోడ్డుమీద ఉన్న దుమ్ము అంతానోల్లుకొందాము అనుకొంటే ఎలాగ? అక్కరలేని తలంపులు పెట్టుకొని వ్యక్తిభావనను పెంచుకొంటూ జీవిస్తూ ఉంటే నీకు జ్ఞానం ఏమిటి? మీరు మనస్సును విశ్లేషణ చేసుకొంటూ, దానిని పరిశీలిస్తూ, మనస్సు ఏ కారణాల వలన బాహ్యముఖం అవుతోంది. ఆ కారణాలను తగ్గించుకొంటూ దానికి లోచూపునేర్పాలి. మనోమూలం మన హృదయంలోనే ఉంది. మనస్సును ఉపసంహరించి, అది ఇప్పుడు శిరస్సులో ఎంత సహజంగా ఉంటోందో అంత సహజంగా దాని మూలమైన హృదయంలో మనస్సు ఉండగలిగితే మనస్సు నశిస్తుంది, బ్రహ్మానుభవం కలుగుతుంది. మనోమూలాన్ని తెలుసుకొంటే నీవు మహర్షివి అవుతావు. మీరు అనవసరంగా వారు ఏమనుకొంటున్నారు, వీరు మన గురించి ఏమనుకొంటున్నారు అనే గొడవలలోనికి వెళ్లవద్దు. వారు ఎలా అనుకొన్నా, వీరు ఎలా అనుకొన్నా అదీ అహంకారమే, ఇదీ అహంకారమే. దీనినే ఆబ్జక్టివ్ తింకింగ్ అంటారు, ఆబ్జక్టివ్ తింకింగ్ ఉన్నవాడు ఎవడూ మహర్షి అవ్వలేడు. మన గురించి వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అంటే మీకు జ్ఞానంరాదు, మీ గురించి మీరు ఆలోచించుకోవటంవలన, మీలోని లోపాలు తెలుసుకొని వాటిని తొలగించుకోవటంవలన మీకు జ్ఞానం కలుగుతుంది. మన గురించి ఇతరులు ఏమనుకొంటున్నారు అంటే చివరకు అజ్ఞానం పెరుగుతుంది, బతికి ఉండగా దుఃఖం, చనిపోయిన తరువాత చీకటిలోకాలు మిగులుతాయి. ఓ అర్జునా! జ్ఞానమును సంపాదించు, జ్ఞానముతో సమానమైన వస్తువు ఏదీలేదు. సూర్యుడు ఉదయించగానే చీకటిలోఉన్న వస్తువులు కూడా మీకు ఎలా కనిపిస్తున్నాయో అలాగే నీకు జ్ఞానం కలిగాక నీ హృదయంలో ఉన్న బ్రహ్మం నీకు గోచరమవుతుంది, నీవు బ్రాహ్మీస్థితిని పొందుతావు అని భగవంతుడు చెప్పాడు.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-12-03, భీమవరం**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సబ్జక్టు అనుభవంలో ఉండి చెప్పటంవేరు, ఏదో పుస్తకాలు చదివి చెప్పటంవేరు. నువ్వు ఏదైతే చెపుతున్నావో అది అయిఉండి చెపితే దానివలన ఇతరులకు వివేకం కలుగుతుంది, వారి చైతన్యస్థాయి పెరుగుతుంది. ఈ దేహం నేను అని ప్రతీ మానవుడు అనుకొంటున్నాడు. అయితే ఈ దేహం నువ్వా? ఈ దేహం నువ్వుకాదు అందుచేత మరణించినప్పుడు దేహంలో నుండి విడిపోతున్నావు. ఈ దేహమే కనుక నువ్వు అయితే అది ఎప్పుడూ నీకూడా ఉండాలి. ఎక్కడో మరణందాక ఎందుకు గాఢనిద్రలోనే ఈ దేహంతో నీకు సంబంధం లేదు. నిద్రపోయేవాడికి ఏ గొడవలేదు, దేనితోను వాడికి తాదాప్యం లేదు. మనకు డబ్బుఉందని భోగాలు పెంచుకోకూడదు. మనం రోజూ అన్నం తింటున్నాము. శరీరానికి రోగం వచ్చేలాగ తినకూడదు, ఆకలి తగ్గేలా తినాలి. మనం బట్టలు ఎందుకు కట్టుకొంటున్నాము ? శరీరాన్ని కప్పకోవటానికి బట్టలు కట్టుకొంటున్నాము అంతకంటే బట్టలప్రయోజనం ఏమీ లేదు. బట్టలు కొనుక్కోవచ్చు కాని డబ్బుఉందికదా అని 100 చీరలు కొనుక్కోవటం ఎందుకు? డబ్బు ఉందికదా అని 4 పూటలు తింటే ఎలాగ ? డబ్బును మంచి పనులకు ఉపయోగించాలి మనకు  ధనం ఉంది అని కేవలము పొట్టకు, బట్టకు ఖర్చుపెడుతూ ఉంటే ఈ లోకంలో సుఖపడము, పరలోకంలో కూడా సుఖపడలేము. రమణమహర్షిగారికి గౌరవం మీద, కీర్తిమీద ఏదైనా కాంక్ష ఉందా అని ఒకసారి ప్లీడర్‌గారు అడిగారు. అసలు ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు అని అడిగాను. రమణమహర్షి గొప్పవారు అని ఎవరైనా పేపరులో వ్రాస్తే ఆ పేపరు కటింగ్స్ లైబ్రేరీలో పెట్టమనేవారు కదా ఎందుకు అలా అనేవారు. అలాకాదు మన దేహాలు ఎప్పుడూ ఉండవుకదా, తరువాత తరాలవారు వచ్చి చూసుకొంటారు అని వాటిని లైబ్రేరీలో పెట్టమన్నారు. అంతమాత్రం చేత ఆయనకు కీర్తి మీద కాంక్ష ఉంది అని అనుకోనక్కరలేదు. ఇప్పుడు మనం డబ్బు సంపాదిస్తున్నాము, అంతా మనమే తినేయటంలేదు, వెనకాలవారిగురించి ఆలోచిస్తున్నాము కదా. రమణమహర్షిని పొగడటమేకాదు, విమర్శిస్తూ వ్రాసిన వారు కూడా ఉన్నారు. ఆయనను విమర్శిస్తూ వ్రాసిన పేపర్లు కూడా లైబ్రేరీలో పెట్టమనేవారు అది మీకు తెలియదేమో అని  ఆ ప్లీడరుగారికి చెప్పాను. అసలు ఆయనకు సమానబుద్ధికనుక లేకపోతే ఆయన జ్ఞాని అవ్వలేడు. మమకారం నశించినవాడే మోక్షాన్ని పొందుతాడు. మీరు ఎవరి భక్తులైనా మమకారం నశించకుండా ఎవ్వరూ మోక్షాన్ని పొందలేరు. గురువు పట్ల రంధ్రాన్వేషణ పనికిరాదు. రమణమహర్షికి అసలు కీర్తికాంక్ష ఉందా అనే గొడవలు అనవసరం, అలా గురువుపట్ల రంధ్రాన్వేషణ పనికిరాదు. ప్రపంచం ఉన్నవాడికి కీర్తికాంక్ష ఉండవచ్చు, అసలు దేహమే లేనివాడికి, మనస్సే లేనివాడికి, ప్రపంచంలేనివాడికి కీర్తికాంక్ష ఏమిటి? జ్ఞానమార్గం గురించి రమణమహర్షి చెప్పినది ఎవరో వ్యాసం వ్రాసారు, ఆ పేపరు జాగ్రత్త పెట్టమన్నారు, అంతమాత్రంచేత ఆయనకు గౌరవం మీద కాంక్ష ఉంది అని అనుకోకూడదు, ఆ రకమైన ఆలోచనమంచిది కాదు అనిచెప్పాను. మనం కోరిక పెంచుకొంటూ వెళతాము అనుకోండి, ఉద్రేకం పెంచుకొంటూ వెళతాము అనుకోండి, మాటలో చేతలో ఇతరులను హింసిస్తూ ఉంటాము అనుకోండి మనం చనిపోయిన తరువాత చీకటిలోకాలు వస్తాయి. భక్తిలేనివారు భక్తిని తేలికగా చూస్తారు. మనం ఎంత కష్టపడితే, ఎన్ని జన్మలు సాధన చేస్తే ఈ భక్తి వచ్చిందో వారికి తెలియదు. భక్తి అంటే అంత తేలికగా లేదు.  ఏదో గుడికి వెళ్లటం వలన భక్తివచ్చేయదు, మీరు పూర్వజన్మలలో సత్కర్మలు  చేసి ఉంటారు, పెద్దలను సేవించి ఉంటారు, ఈశ్వరుని పాదాలను ఆశ్రయించి ఉంటారు. మీరు పూర్వజన్మలలో సత్కర్మలు చేసి ఉండకపోతే ఈ జన్మలో అసలు భక్తికలుగదు. మనం పూర్వజన్మలలో మంచిపనులు చేసి ఉంటాము కాబట్టి ఇప్పుడు రమణుడు గురించో, ఈశ్వరుడి గురించో మాట్లాడుకొంటున్నాము లేకపోతే ఆ బుద్ధి కూడా మనకు కలుగదు. పోరాటపటిమ ఉన్నవాడు రాజకీయరంగంలో అభివృద్ధిలోనికి వస్తాడు, సాధనా బలం ఉన్నవాడు ఆధ్యాత్మికరంగంలో అభివృద్ధిలోనికి వస్తాడు, భక్తుడికి సాధనాబలం

ఉండాలి. లింకన్‌కి పోరాటపటిమ ఉంది. జీవితంలో అనేకసార్లు ఓడిపోయాడు అయినా పిరికిపడలేదు, ఆత్మవిశ్వాసం పోగొట్టుకోలేదు, చివరకు ప్రెసిడెంట్ అయ్యాడు. మనం ఈ లోకానికి సంబంధించిన పనిచేస్తూఉన్నా, సాధనచేసుకొంటూఉన్నాకూడా బద్ధకం పనికిరాదు, బద్ధకస్తుడికి ఈ లోకం లేదు, పరలోకంలేదు. శరీరం పుడుతుంది, శరీరం మరణిస్తుంది, ఈ శరీరాలు అన్నీ స్వప్నశరీరాలే, ఈ దేహాలు అన్నీ నీడలే. మనకు బ్రహ్మభావన లేదు అనుకోండి, సమానబుద్ధి రాలేదు అనుకోండి, దేహంలోపల నేను ఉన్నాను, దేహము బయట ప్రపంచం ఉంది, దేవుడు ఎక్కడో ఉన్నాడు అనేటువంటి ఆలోచనలు మనకు నశించలేదు అనుకోండి మనకు పునర్జన్మలు వచ్చి తీరతాయి. అన్ని కోరికలు నెరవేరినా చివరకు ఒక్కకోరిక మిగిలిఉన్నా, ఒక్కవాసనఉన్నా పునర్జన్మ వచ్చి తీరుతుంది. సాధకుడు వాసనారహితుడు అయ్యేవరకు వాడిని జన్మలు వెంటాడుతాయి. మనం ఎన్నిసాధనలు చేసిన మనచేత చూడబడుతున్నటువంటి ఈ ప్రపంచం నిజం అనుకొన్నంతకాలం మనస్సులోపలకు వెళ్ళదు. అసలువస్తువు మనస్సుకు, ఇంద్రియాలకు అతీతంగా ఉంది. అది ఇంద్రియాలచేత, మనస్సుచేత తెలుసుకోబడేదికాదు, ఎక్కడయితే ఇంద్రియాలు అణిగాయో, ఎక్కడయితే మనస్సు అణిగిందో అక్కడే అది తెలియబడుతుంది. అది తెలుసుకొనేది కాదు, తెలియబడేది, ఈశ్వరుని దయలేకుండా అది తెలియబడదు. మనంకాలాన్ని పాడుచేసుకోకూడదు, కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ దేహం మరణించేటప్పుడు ఎంతవరకు సాధనచేసామో, ఎంతవరకు మన చైతన్యస్థాయిని పెంచుకొన్నామో, ఎంతవరకు మనబుద్ధిని బాగుచేసుకొన్నామో అంతవరకేగాని ఈ శరీరం పోయి మరల కొత్తశరీరం వచ్చేలోపు మధ్యలో సాధన ఏమీ జరగదు. శరీరం మరణించిన తరువాత వెళితే మంచిలోకాలకు వెళతాము లేకపోతే చెడ్డలోకాలకు వెళతాము, ఆ లోకాలలో స్థిరంగా ఉండము, మరల ఈ భూమి మీదకు రావలసిందే, ఇక్కడేసాధన చేసుకోవాలి అందుచేత ఇప్పుడు మనం కాలాన్ని పాడుచేసుకోకూడదు. కాలం ఇలా ప్రవహిస్తూ ఉంటుంది, మనం కాలాన్ని సద్వినియోగం చేసుకొంటే మనకు బ్రహ్మానుభవం కలుగుతుంది. ఈశ్వరానుగ్రహం సంపాదించే మాటలు మాట్లాడాలి, చేతులతో ఈశ్వరానుగ్రహం సంపాదించే పనులుచేయాలి, ఈశ్వరానుగ్రహం సంపాదించే తలంపులు పెంచుకోవాలి. ఈశ్వరానుగ్రహం లేకుండా, ఈశ్వరుని దయలేకుండా మనం ఏమీ సాధించలేము. నీకు అజ్ఞానం ఉన్నంతకాలం జన్మలు విడిచిపెట్టవు. అజ్ఞానం అంటేఏమిటి? నేను ఎవరినో నాకు తెలియకపోవటం అజ్ఞానం, నేను ఎవరినో నాకు తెలిసేవరకు ఏదో కులంతోటి, ఏదో మతంతోటి, ఏదోరంగుతోటి, ఒకదేశంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి తాదాప్యం పొందుతూ ఉంటాను, అదే అజ్ఞానం. నేను ఎవరినో నాకు తెలిస్తే జ్ఞానం. సత్యవస్తువు మన హృదయంలో ఉంది. దానిని ఎలా తెలుసుకోవాలి? దానికోసం ఎలా సాధనచేయాలి? మీరు ప్రేమతో శ్రద్ధగా భగవంతునినామాన్ని జపిస్తున్నారు అనుకోండి, మీకు శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం కలుగుతుంది. మనం ఏదైతే పొందాలి అనుకొంటున్నామో



దానిగురించి సమగ్రంగా, శ్రద్ధగా శ్రవణంచేసి దానిని పుస్తకాలలో కాకుండా మస్తకంలో పెట్టుకోవాలి. తరువాత మనం నేర్చుకొన్నదానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేయాలి. నువ్వు నేర్చుకొన్నది జ్ఞానం, నువ్వు నేర్చుకొన్నది అనుభవంలోనికి తెచ్చుకోవటం విజ్ఞానం. భగవంతుడు చెప్పిన మాటలను శ్రద్ధగా వింటున్నారు అనుకోండి, భగవంతుడి పట్ల గౌరవం పెంచుకొంటున్నారు అనుకోండి, భగవంతుడు ఉన్నాడు అనేబుద్ధిని స్థిరం చేసుకొంటున్నారు అనుకోండి, ఇదికూడా జ్ఞానయజ్ఞంలో భాగము. జీవుడు కల్పించబడ్డాడు, ఈశ్వరుడు కల్పించబడలేదు, జీవుడికి కారణం భగవంతుడు అంటున్నారు మరి భగవంతుడికి ఎవరుకారణం? ఆయనకు ఆయనే కారణం, ఆయనకు ఇంకొకడు కారణం అయితే ఆయన భగవంతుడేకాదు. మనం సబ్జక్టును విడిచిపెట్టకూడదు, ఆలోచనను విడిచిపెట్టకూడదు. మీ స్వేచ్ఛను చంపటం నాకు ఇష్టం లేదు, మీ స్వేచ్ఛను కనుక నేను చంపుతూ ఉంటే నేను గురువును కాదు, ఈ కుర్చీలో కూర్చోవటానికి నాకు అర్హతలేదు. గురువు చేసేపని ఏమిటి అంటే నీకు ఉన్న అజ్ఞానాన్ని తగ్గించాలి అంతేగాని నీకు ఉన్న అజ్ఞానాన్ని పెంచకూడదు. మీ స్వేచ్ఛని పోగొట్టి మిమ్మల్ని బంధించేవాడు గురువుకాదు, మీకు ఫ్రీడమ్ తీసుకొని వచ్చేవాడే గురువు. విద్యలు అనేకమైనవి ఉన్నాయి అర్జునా! అందులో ఆత్మవిద్యను నేను అని భగవంతుడు చెప్పాడు. ఆత్మవిద్యతో సమానమైనది ఈలోకంలో లేదు, ఇతరలోకాలలో ఉందని అనుకొంటున్నావేమో ఇతరలోకాలలో కూడా లేదు అని చెప్పాడు. ఒకసాధనా ప్రక్రియను చూపిస్తూ, సాత్వికబుద్ధిని ఎలా పెంచుకోవాలో చెపుతూ, మాటలో ఆలోచనలో పనిలో ఎలా సౌమ్యంగా జీవించాలో చెపుతూ గమ్యాన్ని చూపిస్తూ గీతను భోధించాడు వాడువాసుదేవుడు, వాడే భగవంతుడు. ప్రపంచంలో ఉన్నసంపద అంతా నీ దగ్గర ఉంది అనుకో, నీకు శాంతిలేదు అనుకో, అప్పడు తెలుస్తుంది. ఈ సంపదకంటే శాంతి గొప్పది అని నీకు తెలుస్తుంది, అప్పటివరకు సంపదవస్తే శాంతి వచ్చేస్తుంది అనుకొంటాము అని ఒక అమెరికన్ డాక్టరు చెప్పారు. మీకు అజ్ఞానాన్ని పంచిపెట్టటానికి, అసూయనుపంచి పెట్టటానికి నేను ఇక్కడకు రాలేదు. మీకు ఆనందాన్ని పంచిపెట్టకపోతే, శాంతిని పంచిపెట్టకపోతే మేము గురుస్థానంలో కూర్చోవటానికి పనికిరాము. దు:ఖంపంచిపెట్టటానికి జిన్నూరు నుండి భీమవరం రావటం ఎందుకు? పెట్రోలు దండగ, టైము వేస్టు, మేము పంచిపెట్టగలిగితే మీకు శాంతిని, ఆనందాన్ని కాంతిని పంచిపెట్టాలి, దు:ఖంలేనిస్థితికి మిమ్మల్ని తీసుకొనివెళ్ళగలగాలి, ఆశక్తి మాకు లేనప్పడు మా ఇంటి దగ్గర మేము కూర్చోవటం మంచిది. నువ్వు దేహమే అనుకో, దేహం అనుకొంటే ఇబ్బంది లేదు. నువ్వు చైతన్యంగా ఉన్నావు, ఆ చైతన్యాన్ని దేహనికి పరిమితం చేయటం వలన నిన్ను దు:ఖం వెంటాడుతుంది. అంటే దేహాత్మబుద్ధి నశించేవరకు నీకు అంగబలం ఉన్నా, అర్ధబలంఉన్నా, అధికారంఉన్నా నీవు భక్తుడివి అయినా నిన్ను దు:ఖం విడిచిపెట్టదు. మనం ఏదిగా ఉన్నామో దాని తాలుక ఎరుక జ్ఞానం, మనం ఏదిగా ఉన్నామో దానితాలుక ఎరుక లేకపోవటమే అజ్ఞానం. మనకు వ్యక్తులు ప్రధానం కాదు, రమణమహర్షిగారా, నాన్నగారా అని కాదు మనకు సబ్జక్టుప్రధానం.

మీరు సబ్జక్టు వినేటప్పుడు మీ వివేకం ఎలా ఉండాలంటే మనం అన్నం తినేటప్పుడు అందులో కూరకలుపుకొంటాము అందులో పచ్చిమిరపకాయ ముక్కలు వస్తాయి, తాలింపు ముక్కలు వస్తాయి వాటిని తీసి ఒకప్రక్కన పెట్టేస్తాము అలాగే నేను అనవసరమైన మాటలు చెపుతున్నాను అనుకోండి, వాటిని తీసి ఒకప్రక్కన పెట్టేయండి. అక్కడ నాన్నగారు ప్రధానం కాదు, సబ్జక్టు ప్రధానం, ఆలోచన ప్రధానం, ఆలోచనకూడా అమృతంతో సమానము. చనిపోయిన తరువాత ఏమౌతాము అని అందరూ అనుకొంటున్నారు, నువ్వు అసలు పుట్టలేదుకదా ఇంక చనిపోవటం ఏమిటిరా అంటున్నారు భగవాన్. పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయినవాడు పుడుతాడు, ఈగోల నీకు  ఎందుకురా? పుట్టినవాడు ఆలోచించుకొంటాడు చనిపోవటం గురించి, చనిపోయినవాడు మరల పుట్టటం గురించి ఆలోచించుకొంటాడు దాని అర్థం ఏమిటిఅంటే పుట్టినదానిగురించి ఆలోచించేది మనస్సు, మరణానంతర జీవితం గురించి ఆలోచించేది మనస్సు అది నువ్వుకాదు కదా, నువ్వు బ్రహ్మము. జీవుడు కల్పించబడ్డాడు, దేవుడు కల్పించబడలేదు, కల్పించబడింది ఎప్పుడూ దు:ఖాన్ని తీసుకొనివస్తుంది, క్షోభనితీసుకొనివస్తుంది.  ఏదిఅయితే సహజమైనదో, ఏదిఅయితే శాశ్వతమైనదో, ఏదైతే నిర్మలంగా ఉంటుందో దానిలోనుండి ఆనందం వస్తుంది. సాధన అంటే ఏమీలేదు మనం కల్పించుకొన్న గొడవలు వదులుకోవటమే సాధన. రూపబుద్ధి, నామబుద్ధి తగ్గించుకొంటూ రావాలి. వాటిని తగ్గించుకొంటూ వస్తే మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది, జీవుడు ఎక్కడ నుండి వచ్చాడో ఆ గుహలో పడిపోతాడు, ఆ గుహలో పడిపోతే మనం పోము, మనం ఎవరిమో మనకు తెలుస్తుంది. మీ వ్యవహారం మీరు జాగ్రత్తగా చూసుకోండి కాని ఇదికూడా స్వప్నమే. ఇప్పుడు మీ చుట్టాలు, స్నేహితులు, విరోధులు కూడా స్వప్నంలో కనిపించే మనుషులు లాంటివారే. మనకు స్వప్నంలో ఎన్ని దేహాలు కనిపిస్తాయో అలాగే ఈ దేహాలు కూడా అటువంటివే. మనకు ఒకోసారి మంచి స్వప్నం వస్తుంది, ఒకోసారి చెడు స్వప్నం వస్తుంది, ఈ రెండూ కూడా అసత్యమే. అలాగే మీ రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి అనుకోండి అది ఒకమంచి స్వప్నం, మీ రోజులు సుఖంగా వెళ్ళటంలేదు అనుకోండి, అది చెడుస్వప్నం. ఆ దేహప్రారబ్ధముననుసరించి అది జరుగుతుంది. ఆ కర్మచేసాను, ఈ కర్మ చేసాను అని మనస్సును పుండుచేసుకొంటున్నావు ఏమిట్రా ? నీవు చేసే కర్మలకంటే, ఈ జన్మలకంటే, నువ్వు చేసిన పుణ్యపాపాల కంటే దేవుని దయ అతీతమైనది, ఉదాత్తమైనది. దేవుని దయ ముందు ఇవన్నీ సున్నలతో సమానము అంటున్నారు భగవాన్. కాలప్రవాహములో మీరు కొట్టుకొని పోతారు, నేను కొట్టుకొనిపోతాను, కర్మలు కొట్టుకొనిపోతాయి, ఈ కొట్టుకొనిపోయే ప్రపంచానికి అతీతంగా, అంతటా వ్యాపించియున్న వస్తువు ఏది అయితే ఉందో అది నీవై ఉన్నావు, అక్కడకు నీ మొఖం త్రిప్పుఅంటున్నారు భగవాన్. నీ స్వభావానికి అనుగుణమైన మార్గంలో ప్రయాణం చేసి వివేకం పెంచుకొని, విచక్షణాజ్ఞానాన్ని పెంచుకొని నశిస్తున్న ఈ ప్రపంచంలో నశించకుండా ఏ వస్తువు అయితే ఉందో ఆ బ్రహ్మమును అనుభవైక వేద్యం చేసుకో ప్రేమ



ఉన్నవాడికి భక్తి కలుగుతుంది, ప్రేమలేనివాడికి రంపంపెట్టి కోసినవాడికి భక్తికలుగదు. అసలు ప్రేమ అంటే ఎలా ఉంటుందో, భక్తిఎలా ఉంటుందో తెలియని జీవులను బద్ధజీవులు అన్నారు రామకృష్ణ పరమహంస. వారికి చీకటి అంటే ఇష్టం. కొంచెం వెలుతురు చూడవయ్యా అంటే కాదు చీకటికి అలవాటు పడిపోయాము, చీకటిలోనే ఉంటాము అంటారు. నేను కోరుకొనేది ఏమిటి అంటే మీరు అరుణాచలంలో ఉన్నా, కాశీలో ఉన్నా, రామేశ్వరంలో ఉన్నా ఎక్కడ ఉన్నా మీరు ఆనందంగా ఉండటం ముఖ్యం. మిమ్మల్ని మా కాలేజీలోనే చదువుకోమని చెప్పటం లేదు, మీరు ఏ కాలేజీలో చదువుకొన్నా మీరు బాగుపడటం ముఖ్యం, మీరు జ్ఞానవంతులు అవ్వాలి, ఆనందంగా ఉండాలి అది మేము కోరుకొనేది. చనిపోయిన తరువాత ఏమౌతాను అంటున్నారు. ఇప్పుడు నీవుబ్రతికి ఉన్నావు కదా, ఆగోల నీకు ఎందుకు? బ్రతికిఉండగా నువ్వు ఎవరో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నంచేయటంలేదు, జ్ఞానం సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయటం లేదు, కాలాన్ని సద్వినియోగం చేసుకోవటంలేదు, చనిపోయిన తరువాత ఏమౌతాను అని ఏడుస్తున్నావు. ఇలా కల్పించుకొని ఏడుస్తావేమిటి? దీనికి అసలు అర్థం ఉందా. ఇంకో సంవత్సరానికి మన శరీరానికి రోగం వస్తుంది అనుకోండి, ఇప్పటినుండి మనం ఆరోగం గురించి బాధపడటం ఏమిటి? అలా బాధపడే బదులు ఆరోగం రాకుండా చూసుకోవటానికి ప్రయత్నం చేయవచ్చుకదా. నేను ఉన్నాను, నేను ఉన్నాను అని ఇప్పుడు నీవు అంటున్నావుకదా. వాడెవడో తెలుసుకో నువ్వు. ఇప్పుడు ఈ శరీరం నీకు ఎలా అనుభవంలో ఉందో అలాగ నీ లోపలఉన్న చావులేని సత్యపదార్థము అంత డైరెక్టుగా నీకు అనుభవంలోనికి రావాలి. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటం మానివేసి చనిపోయిన తరువాత ఏమౌతాను అనే గొడవ ఎందుకు? చనిపోయిన తరువాత నీవు ఏమి అయినా అది నిజంకాదు ఇంకో జన్మఎత్తినా అది నిజంకాదు. నిజంకానిదాని గురించి ఏడుస్తావు ఎందుకు? నిజాన్ని తెలుసుకో, ఇంక ఏడవవలసిన పని నీకు ఉండదు. చనిపోయిన తరువాత ఏమౌతాను అని నీ మనస్సు అనుకొంటోంది. ఆ మనస్సును విచారణ చెయ్యి, ఆమనస్సుకు వివేకం పట్టించు, ఆ మనస్సు ఎవరో తెలుసుకోవటానికి ప్రయత్నించు, మనస్సుకు కొద్దిగా లోచూపు నేర్పి, దానిమూలంలోనికి మనస్సును పంపించు. మనస్సు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, అక్కడ ఉన్న భగవంతుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. అప్పడు చనిపోవటాలు, పుట్టటాలు, చనిపోయిన తరువాత ఏమౌతాము అనే గోల నీకు ఉండదు. బుద్ధుడు, రామకృష్ణుడు, క్రీస్తువారు చెప్పాలని ఏమీ చెప్పలేదు. వారు ఆనందాన్ని అనుభవించి, అనుభవించి, ఆనందం పొంగి ఉండలేక చెప్పినమాటలు కాని మనకు ఏదో చెప్పాలని చెప్పిన మాటలుకాదు. ఏజ్ఞానికూడా మానవజాతిని ప్రేమించాలని ప్రేమించటంలేదు, ప్రేమించకుండా ఉండలేడు కాబట్టి ప్రేమిస్తాడు. ఈజన్మలో పడిన దు:ఖం సరిపోతుంది, ఇంక దు:ఖాన్ని అదనంగా పెంచుకోకు, రాబోయే దు:ఖానికి స్వాగతం చెప్పకు అంటున్నారు భగవాన్. ఈ దు:ఖమే మొయ్యలేకపోతున్నారు, ముందు దీనిని ఎండబెట్టుకో,

అదే తపస్సు, దీనిని ఎండబెట్టుకోవటం మానివేసి, కొత్త దు:ఖాన్ని కలుపుకొంటావు ఎందుకు? అందుచేత అక్కడ ఏమి జరుగుతోంది, ఇక్కడ ఏమిజరుగుతోంది ఆ గొడవలు వదిలెయ్యి, నీ మనస్సులో ఏమిజరుగుతోందో చూసుకో. నీ మనస్సులో ఏమిజరుగుతోందో నీకు తెలియదు, అక్కడ ఏదో సత్రం కట్టిస్తాను అంటావు, కట్టించాలంటే కట్టించు నేను వద్దనిచెప్పటం లేదు, దానివలన పుణ్యం వస్తుంది, అది అనుభవిస్తే పోతుంది, అదే నీ జీవిత గమ్యమా ? అంటే మిమ్మల్ని ఎక్కడికి తీసుకొనివెళ్ళాలో ఆగమ్యం మిస్‌అవ్వకుండా, మిమ్మలను అక్కడకు తరుముకొంటూ వెళుతున్నారు భగవాన్. నువ్వు ఏదైనా మంచిపనిచేయాలంటే చెయ్యి, అదే నీ గమ్యమా? మంచి పనిచేయటమే నీ స్వరూపమా? పుణ్యం అనుభవించటమే నీ స్వరూపమా? ఈ గౌరవాలు మోయటమే నీ స్వరూపమా? దేహం ప్రారబ్దం అనుభవిస్తుంది. దేహాన్ని ప్రారబ్దానికి వదిలెయ్యండి. ప్రారబ్దాన్నిబట్టి సంఘటనలు ఒకోసారి అనుకూలంగా ఉంటాయి, ఒకోసారి ప్రతికూలంగా ఉంటాయి. దేహప్రారబ్దాన్ని బట్టి ఎప్పుడు ఏది జరగాలో అది అలా జరిగిపోతూ ఉంటుంది. మన ఇంట్లో వారిని సుఖపెట్టాలన్నా వారి మనస్సు బాగాలేకపోతే మనం వారిని సుఖపెట్టలేము, వారి దేహప్రారబ్దాన్ని బట్టి వారు ఉంటారు. పాపం మమకారం కొలదీ వారిని సుఖపెట్టాలని మీకు అనిపిస్తుంది. ఆ మమకారం నశించకుండా ఎవరికీ మోక్షం రాదు. మేము ప్రారబ్దమును అనుభవిస్తున్నాము అని చాలామంది అనుకొంటున్నారు. ప్రారబ్దం ఎవరికిరా అంటున్నారు భగవాన్. దేహంతో తాదాప్యం పొందేవాడికి ప్రారబ్దం. వీటిఅన్నింటికంటే భగవంతుడి అనుగ్రహం గొప్పది. భగవంతుని అనుగ్రహాన్ని పొందటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. నేను ప్రారబ్దమును అనుభవిస్తున్నాను అనే గొడవలో ఉంటూ భగవంతుని అనుగ్రహాన్ని మిస్‌అయిపోతున్నాము అంటున్నారు భగవాన్. మీకు మోక్షం ఇవ్వాలి, మోక్షసింహాసనం మీద మిమ్మల్ని కూర్చోబెట్టాలని గురువు మీ దగ్గరకు వస్తాడు. అలా వచ్చినప్పుడు గురువు వైపుకు మీ మొఖం తిప్పరు. నేను ప్రారబ్దమును అనుభవిస్తున్నాను అనే గోలలోనే ఉంటే ఆయన ఏమి చేస్తాడు. మీరు చేతులు చాపాలి కదా, అసలు గురువు వైపుకు మీ మొఖం తిప్పాలి కదా, మీరు గొప్ప అవకాశం పోగొట్టుకొంటున్నారు అంటున్నారు భగవాన్. ఎంతసేపు ప్రారబ్దం గొడవేనా, ధనవంతుడికి అదేగొడవ, ధనంలేనివాడికి అదేగొడవ, అధికారం ఉన్నవాడికి అదేగొడవ, అధికారంలేనివాడికి అదే గొడవ అందరికి ప్రారబ్దం అనుభవించటం గొడవేనా? ఆ ప్రారబ్దం నువ్వా? ప్రారబ్దం మనోదేహములకు సంబంధించినది. దేహం ప్రారబ్దం అనుభవిస్తుంది. దేహమే నేను అనే తలంపును విడిచిపెట్టకుండా నువ్వు టైము పాడుచేసుకొంటున్నావు. ప్రారబ్దానుభవం కంటే ఈశ్వరుని దయగొప్పది. నీ మొఖం అటుతిప్పితే ఒకవేళ నీవు ప్రారబ్దమును అనుభవిస్తూ ఉన్నాకూడా ప్రారబ్దాన్ని అనుభవిస్తున్నట్లు నీకు తెలియదు, ఈశ్వరుని దయ అటువంటిది. వివేకానందుడు ఏమి చెప్పాడుఅంటే ఆకాశంలో సూర్యుడు ఉన్నాడు, ఆయనను మీరు కనిపెట్టనక్కరలేదు. మీరు కళ్ళు మూసుకొని సూర్యుడు లేడుఅంటే ఎలాగ? మీ మొఖాన్ని అటువైపు తిప్పండి అంతే అంతకంటే



అదనంగా మీరు ఏమీ చేయనక్కరలేదు. మేము సూర్యుడిని చూడము, మొఖం ఇలా పెట్టుకొంటాము, తలుపులు మూసేసుకొంటాము, సూర్యకిరణాలురానివ్వము అంటే ఒకవేళ జ్ఞానసూర్యుడు మీకు ఏదైనా సహాయం చేయాలన్నా ఎలాచేస్తాడు, ఇవిఅన్నీ సిల్లీగొడవలు అంటున్నారు భగవాన్. స్వప్నావస్థలో నుండి జాగ్రదవస్థలోనికి వచ్చాము అనుకోండి, ఆస్వప్నం అంతా ఏమైపోయింది, ఈ జీవితం కూడా అంతే. ఇంతకీ భగవాన్ చెప్పేది ఏమిటిఅంటే నువ్వుపడే బాధలకంటే, నీకువచ్చిన కష్టాలకంటే, నష్టాలకంటే వీటిఅన్నింటికంటే భగవంతుని దయ అతీతమైనదిరా నువ్వు అటుచూడు, దేవుని అనుగ్రహం ముందు నువ్వుపడే కష్టాలు ఏపాటివిరా. వరద వస్తూఉంటే గడ్డిపరకలు కొట్టుకొనిపోకుండా అక్కడ నిలబడతాయా? ఈ కష్టాలు,నష్టాలు దేవుని దయ ముందు గడ్డిపరక కొట్టుకొనిపోయినట్లు కొట్టుకొనిపోతాయి. దేవుని దయకంటే ఈ కష్టాలు గొప్పవి అనుకొంటున్నారు అలాకాదు నీ కష్టాలు కంటే దేవుని అనుగ్రహం అతీతమైనది. అది గుర్తుంచుకో. ఇవి అన్నీ చిన్న, చిన్న గొడవలు, ఇలా అల్పవిషయాలను పట్టుకొని నీ కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీరు ఏదైతే అవునో అది మర్చిపోయి కాని విషయాల వెంటతిరుగుతూ, ఇలా చనిపోతూ, పుడుతూ, ఇంకా ఎంతకాలం ఇలా శవాలను మోస్తారు. మీరు అజ్ఞానం అనే నిద్రలో కొట్టుకొనిపోతున్నారు. ఏదో మహాత్ముడు, మహాగురువు మన మీద జాలితో ఈ అజ్ఞానమనే నిద్రలో నుండి మనలను మేల్కొల్పాలిగాని మనంతట మనం ఈ నిద్రలో నుండి బయటకు రాలేము. కోట్లాదిమంది జీవులు ఉంటే నేనే దొరికానా నీకు, వారందరినీ వదిలేసి బాణంవేసి నన్ను పట్టుకొని నన్ను నాకు కాకుండా చేసావు అరుణాచలేశ్వరుడా అంటారు భగవాన్. నా మనస్సు నాకు కాకుండా చేసావు, ఎక్కడికో నన్ను మేల్కొల్పావు. నేను ఏమిచేసాను పూజలు చేసానా, జపంచేసినా, నిన్ను మోసుకొని తిరిగానా, నేను పండితుడినా నన్ను ఎందుకు పట్టుకొన్నావు అన్నారు భగవాన్. అది అకారణప్రేమ. మీరు జపధ్యానములు చేసుకోండి మంచిదే. కాని మనకు ఈశ్వరుడి మీద ఆపుకోలేని ప్రేమ కుదిరింది అనుకోండి, నదీప్రవాహంలో గడ్డిపరక కొట్టుకొనిపోయినట్లు మన అహంకారం, మమకారం అన్నీకూడా ఆ ప్రేమప్రవాహంలో కొట్టుకొనిపోతాయి.



## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 26-01-04 | సోమ | పిట్లవానిపాలెం, నంబూరి మీదగా NH.5 లో పొన్నూరురోడ్‌లో సందోలు వంతెన ప్రక్కనుండి పిట్లవానిపాలెం, గుంటూరు జిల్లా |
| 27-01-04 | మంగ | కర్లపాలెం, గుంటూరు జిల్లా, - డూ - |
| 01-02-04 | ఆది | చించినాడ, గీతామందిరంలో |
| 2 టు 8-2-04 | | విశాఖపట్నం క్యాంపు |
| 06-02-04 | శుక్ర | విశాఖపట్నం, స్టీల్‌ప్లాంట్‌లో |
| 11-02-04 | బుధ | పాలకోడేరు, రామాలయంలో |

## "కారణం నశించిన చోట - కార్యం ఉండదు"

సంస్కారాలే "కారణాలు" వాటిని మనం అనేక జన్మలనుంచి పోగుజేసుకొని వస్తున్నాము వాటి ప్రభావం వల్లనే కార్యాలు చేస్తూ తిరిగి కర్మబంధంలో పడిపోతున్నాము. భోగాలుగా కనిపించేవన్ని పరిణామంలో రోగాలుగా మారి జీవితాన్ని వ్యధామయం చేస్తున్నాయి. మలిన మనస్సుతో ఉన్నంతకాలం మలినాలతో ఆడుకోవటం తప్పదు. ఎక్కడ వెలుగు ఉంటుందో అక్కడ చీకటి ఉండదు. ఎక్కడ జ్ఞానం పరిపాలన చేస్తుందో అక్కడ "కార్యాలు" పలాయనం చెందక తప్పదు. దీనికి సద్గురువు ఇచ్చే "జ్ఞాన బిక్ష" వర ప్రసాదంగా అమూల్యంగా పనిజేస్తుంది. ధన సంపన్న మైన వ్యక్తికి దారిద్ర్యం యందు ఎట్లు ఆసక్తి ఉండదో అదే రీతిగా బ్రహ్మానందసాగరంలో ఓలలాడు జ్ఞానికి భౌతిక విషయాలైన మణులు, మాణ్యాలు, మగువలపైన ఆసక్తి ఉండదు. వికారాలు వారిలో లేవు కాబట్టి ఆకారాలు ఎదురుగా ఉన్నా వికారరహితంగానే ఉంటారు. హేతువులు లేవు కాబట్టి తీతువులు (ఇంద్రియాలు) కూయవు. బుద్ధుడు ఒక పున్నమిరాత్రిలో విశ్రమిస్తూ ఉండగా, సౌందర్యవతి, మహానర్తకి మనోహరంగా అలంకరించుకొని, రుచికరమైన పదార్థాలతో ఆయన్ని మోహపరవశుణ్ణి చెయ్యాలి అని తలుపు తడితే, ఆయన ఆమె పాదాలకు పాదాభివందనం చేసి వినయంగా "అమ్మా నీకుమార్దు నిన్ను ఏవిధంగా సేవించమని ఆజ్ఞ " అనగా ఆమె దిగ్భ్రాంతితో, కన్నీటితో మోకరిల్లి క్షమించమని ప్రార్థించి వెళ్లిదనంతర కాలంలో ఆయన ముఖ్య అనుచరులల్లో ఒకరిగా మారింది. జ్ఞానిలో అలజడులు ఉండవు వారి దృష్టిలో ఆత్మకంటే భిన్నంగా రెండవదిలేదు శ్రీ నాన్నగారు అంటారు "మనస్సు యొక్క సృష్టిలో నీవు ఉన్నంతకాలం ఈ ప్రపంచం నిన్ను పిండిచేసి వదిలిపెడుతుంది. నీ కామక్రోధాలు నీ ఇష్టా అయిష్టాలు. నీ సంతోషం అన్ని నీ మనస్సు యొక్క కల్పితాలు వాటితో నీకు సంబంధంలేదు" అన్నారు. మనం ఒక భౌతిక పదార్థం మీద అపార్థ దృష్టిలో ఆధారపడితే భంగపాట్లు తప్పవు వాటికి అతీతం కావాలి అని దైవ ధర్మం చెబుతోంది. భౌతిక వస్తుజాలం ఆరాధింప తగినదికాదు అని నిత్యజాగరూకతతో జీవిస్తే "కార్యాలు" ఉండవు - కమనీయ జీవితం మన కళ్లముందు ఉంటుంది. దీనికి వారసులవ్వాలంటే దైవీసంపదను వృద్ధిచేసుకోటమే మన ముందు ఉన్న కర్తవ్యం. ఆటంకాలు తొలగితే ఆనందం అందుబాటులోనే ఉంటుంది.

**సాగిరాజు రామకృష్ణంరాజు,** అర్థవరం



భగవాన్ 124వ జయంతి సందర్భముగా సద్గురు శ్రీనాన్నగారిని సన్మానిస్తున్న శ్రీ రమణక్షేత్ర కమిటీ సభ్యులు

**ది. 19-11-03న హైదరాబాద్ హెచ్.యమ్.టి. రోడ్‌లోని, చింతల్‌లో శ్రీ సాయి టిఫిన్స్ హోటల్ ను ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు**



సద్గురు శ్రీ నాన్నగారు, సైమట్ ల్యాబ్స్ అధిపతి శ్రీసుబ్బారావు గారు మరియు హోటల్ అధినేత శ్రీ నాగేశ్వరరావు గారు.